క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేట : ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ సూర్యాపేట లోకల్ బ్రాంచి నూతన కమిటీని గురువారం రాయినిగూడెం వికాస్ ఫార్మసీ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జి.స్వరూపరాణి, ఉపాధ్యక్షుడిగా జి.నటేష్, కార్యదర్శిగా డా. నీలమ్మ, కోశాధికారిగా జి.నరసింహారావు, ఈసీ మెంబర్లుగా సమత, సాయి పవన్, ధీరజ్, గీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఆనంద్ గాడ్గే, జిల్లా ఔషధ అధికారి సురేందర్, ఎన్నికల అధికారి, సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డా. ఆడెపు రమేష్, కళాశాల కరస్పాండెంట్ సాదినేని శ్రీనివాసరావు, ఫార్మసిస్టులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఫ్రిజ్ ఏర్పాటు అభినందనీయం



ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

సూర్యాపేట : వేసవిలో రోగులకు చల్లని నీటి కోసం ఫ్రిజ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎంహెచ్‌ఓ కోటాచలం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు రాజీవ్, సివిల్ సర్జన్ ఆర్ఎం ప్రశాంతి, ఆర్ఎంఓ జనార్దన్, ఐఎంఏ ప్రెసిడెంట్ ఆనంద్ దాంగ్లె, జనరల్ సెక్రటరీ రమేష్‌నాయక్, కోశాధికారి కిరణ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట : గండూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యానగర్ 45వ వార్డులో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయుర్వేద వైద్యం నేడు అనేక ఆరోగ్య సమస్యలకు సరైన చికిత్స అందిస్తుందని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్. కృష్ణ దాసు, బ్రాంచ్ ఇన్‌చార్జ్ పవన్ కుమార్, మీలా వంశి, ముద్ద భిక్షపతి, జి.నాగరాజు పాల్గొన్నారు.

మోటార్లు బిగిస్తే చర్యలు

సూర్యాపేట అర్బన్ : మున్సిపల్ నల్లాలకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని 45, 44, 33వార్డుల్లో నల్లాలకు నేరుగా మోటార్లు పెట్టి నీటిని పట్టుకుంటున్న గృహాల నుంచి 7 మోటార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోటార్లను సీజ్ చేయడంతో పాటు రూ.5000 జరిమానా విధించి, నల్లా కనెక్షన్‌ను శాశ్వతంగా తొలిగించినట్లు పేర్కొన్నారు.

హోటల్‌కు జరిమానా

సూర్యాపేట అర్బన్ : దురాజ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన హంగ్రీ బర్డ్స్ హోటల్‌లో బిర్యానీలో ఈగలు రావడంతో కస్తమర్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు, మున్సిపాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కస్టమర్ల ఫిర్యాదు మేరకు అధికారులు సంబంధిత హోటల్‌ను తనిఖీ చేసి హోటల్ యాజమాన్యానికి రూ.5000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప అగ్నిప్రమాదం

సూర్యాపేటటౌన్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జిల్లా కేంద్రంలోని డీసీబీ బ్యాంకులో గురువారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన ప్రకారం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బ్యాంకులోని సర్వర్ గదిలో నిప్పు అంటుకొని పొగలు వచ్చాయి. వెంటనే అలారం మోగడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ ప్రమదంలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు.

కోనోకార్పస్ చెట్లను తొలగించరూ..



జమ్మిగడ్డ రాజీవ్‌పార్క్ సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కోనోకార్పస్ చెట్లు



వేర్లతో సహా తొలగించకపోవడంతో మళ్లీ చిగురించిన కోనోకార్పస్ చెట్లు



పట్టణంలోని నిర్మలా హాస్పిటల్ రోడ్‌లో ఉన్న కోనోకార్పస్ చెట్లు

- సూర్యాపేట పట్టణంలోని చాలా ప్రాంతాల్లో పెరుగుతున్న మొక్కలు
- ప్రజారోగ్యం దృష్ట్యా వాటిని తొలగించాలని కోరుతున్న స్థానికులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కోనోకార్పస్ మొక్కలు అందంగా, ఆకర్షణీయంగా పెరుగుతుండడంతో సూర్యాపేట పట్టణంలోని వివిధ ప్రాంతాలలో విరివిగా నాటారు. హరితహారంలో భాగంగా నర్సరీల్లో ఎక్కువగా ఈ మొక్కలను పెంచడం గమనార్హం. ఈ మొక్కలను రోడ్ల పక్కన, డివైడర్ల మధ్యన, పార్కుల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, ఇళ్ల ఆవరణల్లో అధికంగా నాటారు.

ప్రమాదం అని తెలిసినా..

కోనోకార్పస్ మొక్కల పుప్పొడితో మానవాళి ఆరోగ్యానికి ముప్పు అని, శ్వాస సంబంధ సమస్యలు ఎదురవుతాయని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలడంతో ఈ మొక్కలను నర్సరీల్లో పెంచడం, నాటడం ఆపాలని గత ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే అప్పటికే నాటిన మొక్కలు పట్టణంలోని చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. ఆ మొక్కలను పూర్తిగా తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పట్టణంలోని జమ్మిగడ్డ రాజీవ్‌పార్క్ సమీపంలో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై విరివిగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు దర్శనమిస్తాయి. అలాగే పట్టణంలోని శాంతినగర్‌లో, హైటెక్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ హైవే డివైడర్ల మధ్యన కొట్టేసిన మొక్కలు మళ్లీ చిగురిస్తున్నాయి. అధికారులు చొరవ చూపి మానవ ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే కోనోకార్పస్ చెట్లను తొలగించి.. వాటి స్థానంలో పూలు, నీడ నిచ్చే మొక్కలు నాటి ప్రజారోగ్యం పరిరక్షించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారిని వివరణ కోరగా.. నాటిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, వస్తే వెంటనే తొలగిస్తామని వెల్లడించారు.

ప్రకృతికి మేలు చేసే మొక్కలు నాటాలి



కోనోకార్పస్ చెట్లు అందంగా పెరుగుతున్నాయని నేను మా ఇంటి ముందు నాటాను. దాని చెడు ప్రభావం గురించి తెలిశాక తొలగించాను. చాలా బలమైన వేరు వ్యవస్థ కలిగిన కోనోకార్పస్ చెట్లను పూర్తిగా వేర్లతో సహా తొలగిస్తేనే వాటిని నిర్మూలించడం సాధ్యం అవుతుంది. ఇటీవల మొదలు వరకు కొట్టేసిన చెట్లు మళ్లీ చిగుళ్లు వేస్తున్నాయి. పూర్తిగా తొలగించి వాటి స్థానంలో ప్రకృతికి మేలు చేసే మొక్కలు నాటాలి.

– సకినాల వీరబాబు, సూర్యాపేట

అందాల పోటీలను రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణలో నిర్వహించదలసిన అంతర్జాతీయ అందాల పోటీలను రద్దు చేయాలని కోరుతూ పీఓడబ్ల్యూ, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట ఎమ్మార్వో శ్యామ్‌సుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి మాట్లాడారు. తెలంగాణలో అంతర్జాతీయ అందాల పోటీలు నిర్వహిస్తే తెలంగాణ ఖ్యాతి అంతర్జాతీయంగా వ్యాపిస్తుందని తప్పుడు ప్రచారం చేస్తూ.. మహిళలను ఆట బొమ్మలుగా తయారు చేయడం సరికాదన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా నిర్వహించే అందాల పోటీలను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని అన్నారు. శనివారం పీఓడబ్ల్యూ, ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు మారసాని చంద్రకళ, సహాయ కార్యదర్శి సంతోషి, కోశాధికారి జయమ్మ, ఐద్వా కోశాధికారి మేకబోయిన సైదమ్మ, నాగమ్మ, కోట సృజన, పద్మ, గోగుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మంచి ధర అందించాలి



భానుపురి : మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్

భానుపురి : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చే ధాన్యానికి మంచి ధర అందించాలని మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్‌గుప్త మార్కెట్ అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన సందర్శించి రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ కార్యాలయంలో రైతులకు పడిన ధరలను పరిశీలించి, మంచి ధర వేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. ఆయన వెంట మార్కెట్ సెక్రటరీ సంతోష్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస్, యూడీసీ ఖాసీం, మర్ల కరుణాకర్ రెడ్డి, ధరావత్ ధర్మానాయక్, సిరివెళ్లి సైదులు, వెంకన్న,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇస్తాం



తిరుమలగిరిలో భూ భారతి ప్రొసీడింగ్ కాపీ చూపిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో తొమ్మిది మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని 9 మండలాలకు 3500 ఇళ్లు మంజూరయ్యాయని, 9 పైలట్ గ్రామాల్లో 636 ఇళ్లు, మిగతా గ్రామాల్లో 2864 ఇళ్లను నిర్మిస్తామని తెలిపారు. గతంలో పది సంవత్సరాల నుంచి ధరణి వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్తగా భూ భారతి చట్టం తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ధరణి దరిద్రం పోయిందని, భూ భారతి చట్టం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వేణుమాధవరావు, ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షకుడు యాదగిరి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఏఈలు పాల్గొన్నారు.

దమ్ముంటే ప్రభుత్వాన్ని టచ్ చేయాలి

కొద్దిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలగొడుతామని చెబుతున్నారని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాన్ని టచ్ చేస్తే అగ్గి రగులుతుందని ఎమ్మెల్యే సామేల్ హెచ్చరించారు. గురువారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు బేరసారాలకు తలొగ్గేవారు కాదని హెచ్చరించారు. వరంగల్‌లో జరిగే సభ కోసం చందాలను వసూలు చేయడానికి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని హెచ్చరించారు. సమావేశంలో నూతనకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, మూల అశోక్‌రెడ్డి, జమ్మిలాల్, యాదగిరి, వెంకన్న, కృష్ణ, అబ్బాస్, హాఫీజ్, సుధాకర్, సోమేష్, ప్రేమ్ ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : ముకుందాపురం సబ్‌స్టేషన్ పరిధిలో చందుపట్ల గ్రామానికి సంబంధించిన 11కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా, అలాగే చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పౌష్టికాహారం అందించాలి

తిరుమలగిరి : బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఖైరున్నీసా అన్నారు. గురువారం గుండెపురి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌టీసీ ప్రవళిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వెంకటమ్మకు నివాళి

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం వెంకటమ్మ చిత్రపటానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బండి రజనీకుమార్, శ్రీరామ్, శ్యామ్, రాజేందర్, సుమన్, తదితరులు ఉన్నారు.

డాక్టర్లు లేని ఆస్పత్రులపై చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డాక్టర్ రామ్మూర్తి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో డాక్టర్లు లేకుండా నడిపిస్తున్న వైద్యశాలల విషయంలో రాజీలేదని, అటువంటి ఆస్పత్రులపై ఐఎంఏ తప్పకుండా చర్యలు తీసుకుంటుందని సీనియర్ డాక్టర్ రామ్మూర్తి అన్నారు. సూర్యాపేటలో డాక్టర్లు లేకుండా నడిపిస్తున్న వైద్యశాలల విషయమై గురువారం సాయంత్రం ఎస్పీకి ఐఎంఏ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సూర్యాపేటలో మేనేజ్మెంట్ నిర్వహణలో డాక్టర్లు లేకుండా దాదాపు 60 ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి, ఎస్పీకి వినతిపత్రాలు ఇచ్చామని అన్నారు. శుక్రవారం కలెక్టర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు యశ్వంత్ రెడ్డి, కిరణ్, రమేష్ నాయక్, తెలంగాణ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్



నాలా నుంచి తీసిన వ్యర్థాలు

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని మురుగు కాలువలు, నాలాల్లో పూడిక తొలగింపు పనులు చెప్పట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో



కోర్టు ఎదుట రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : సూర్యాపేట బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది మంతపురం కిశోర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ న్యాయవాదిపై దాడి చేసిన సూర్యాపేట పట్టణానికి చెందిన ఉగ్గం రాములు, అతని వెంట వచ్చిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సూర్యాపేటలో బైక్ ర్యాలీ నిర్వహించి, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, కోశాధికారి ఎండీ లతీఫ్, జాయింట్ సెక్రటరి దావుల వీరప్రసాద్ యాదవ్, లైబ్రరీ సెక్రటరి రాచకొండ యాదగిరి, గేమ్స్ సెక్రటరి ధరావతు వీరేష్ నాయక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు



మాట్లాడుతున్న పూల్లూరి సింహాద్రి

సూర్యాపేట అర్బన్ : కొన్ని ప్రైవేట్ స్కూళ్లు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని, అటువంటి స్కూళ్ల పర్మిషన్‌ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పూల్లూరి సింహాద్రి అన్నారు. గురువారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా ముందస్తుగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు అడ్మిషన్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు కనీసం తనిఖీలు చేయడం లేదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇచ్చే ముడుపులు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతి లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, మహేష్, నవీన్, వినయ్, శ్రీధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధిపై అధికారుల విచారణ

ఆత్మకూర్(ఎస్) : నెమ్మికల్లు సంఘ బంధం శ్రీనిధి నిధుల వినియోగంపై ఇటీవల సంఘం సభ్యులు చేసిన ఆరోపణల నేపథ్యంలో గురువారం అధికారులు విచారణ జరిపారు. సంఘ బంధం, శ్రీనిధి డబ్బులను సంఘాల సభ్యులు చెల్లించినా బ్యాంక్‌లో జమచేయడంలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు. కాగా విచారణలో ఎలాంటి అవకతవకలు జరగలేదని తేలింది. సంఘాల లీడర్లకు, వీబీకేకు అవగాహన లోపంతోనే ఆరోపణలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రత్తయ్య, సీసీ చందు, శ్రీనిధి మేనేజర్ సతీష్, సంఘ బంధం అధ్యక్షురాలు నాగమణి, వెంకటరమణ, బీరెల్లి పర్మిల, క్రిష్ణవేణి, వీడీకే ఇందిర పాల్గొన్నారు.

ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు



మాట్లాడుతున్న శ్రీవాణి

ఆత్మకూర్(ఎస్): ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి పేర్కొన్నారు. గురువారం ఆత్మకూర్(ఎస్)లోని ఐకేపీ అంబేడ్కర్ భవనంలో అభిన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత న్యాయ శిబిరంలో పాల్గొన్నారు. 18 ఏళ్ల నిండని పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొంపల్లి లింగయ్య, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సుంకరబోయిన రాజు, తహసీల్దార్ హరికిషోర్ శర్మ, ఎంపీడీఓ హాషిం, డీఎల్ఎస్ఏ నామినేటెడ్ మెంబర్స్ అల్లమనేని వెంకటేశ్వర్లు, గుంటూరు మధు, నల్లపాటి మమత, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బి.వెంకట రత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.వాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి. విష్ణుస్వరూప్, బార్ అసోసియేషన్ మెంబర్ జ్యోతి, అభిన ఛారిటబుల్ ట్రస్ట్ కార్యనిర్వాహకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య



మద్దిరాల : ముకుందాపురంలో బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ కాట్ల రవికుమార్



తుంగతుర్తి : ఉన్నత పాఠశాలను సందర్శించిన గానుగబండ పాఠశాల విద్యార్థులు



పెన్‌పహాడ్ : అనాజిపురం ఆదర్శ పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి

మద్దిరాల : ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ కాట్ల రవికుమార్ అన్నారు. గురువారం ముకుందాపురం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోచిష్ణుకుమార్, నాగేష్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, రేపాక లింగయ్య, వెంకటేశ్వర్లు, బి.తిరుమలేష్, కొరివి మధు, అలీముద్దీన్, పి.సురేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి రాములు నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పాఠశాలల్లో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్చే విధంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పిస్తున్నట్లు ఎంఈఓ బి.బాలునాయక్ చెప్పారు. తిమ్మాపురం గ్రామంలో గురువారం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కుంభం ప్రభాకర్, పీఎస్ హెచ్ఎం చంద్రారెడ్డి, రెండు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంగతుర్తిలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్

తుంగతుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి బోయిని లింగయ్య అన్నారు. గురువారం ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా గానుగబండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు తుంగతుర్తి ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన, నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందుతాయని తెలిపారు. అనంతరం పాఠశాలలోని మౌలిక వసతులను విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, లక్ష్మి, ఉపాధ్యాయులు యాకయ్య, భాస్కర్, కృష్ణవేణి, సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కంప్యూటర్ జ్ఞానం నేర్చుకోవాలి

పెన్‌పహాడ్ : విద్యార్థులు విద్యతోపాటు కంప్యూటర్ జ్ఞానం, ఆధునిక టెక్నాలజీ ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) గురించి నేర్చుకోవాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. గురువారం అనాజిపురం గ్రామంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐసీటీ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కోడి లింగయ్య, మండల నోడల్ అధికారి ధరావత్ వస్రాంనాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్నామేరి, వైస్ ప్రిన్సిపల్ కె. గురుచరణ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నూతనకల్ : బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, తదితరులు



అర్వపల్లి : తిమ్మాపురంలో బడిబాటపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

కొబ్బరికాయల విక్రయానికి వేలం

చివ్వెంల : మండల పరిధిలోని శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) కొబ్బరి కాయల వేలంపాటను గురువారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025 నుంచి 2027 జాతర దిష్టి పూజ కార్యక్రమం వరకు కొబ్బరికాయల విక్రయానికి గాను రూ.2.35 లక్షలకు వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మున్న సైదులు దక్కించుకున్నాడు.

ప్రశాంత వాతావరణానికే 'ప్రజా భరోసా'

అర్వపల్లి : గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రతి ఒక్కరిని సన్మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో ఎస్పీ నరసింహ పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన ప్రజా భరోసా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ఎస్సీబాలికల వసతి గృహాన్ని ఆర్డీఓ వేణుమాధవరావు గురువారం తనిఖీ చేశారు. వసతి గృహం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండి పెట్టవలసిన ఆహార పదార్థాల్లో తేడాలు ఉన్నాయని తెలిపారు. రిపోర్టులను ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ దయానంద్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చివ్వెంల : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సైదయ్య అన్నారు. గురువారం గుంజలూరు గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకన్న, ఉపేందర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. అర్వపల్లికి కొత్తగా మంజూరైన ఎన్‌డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బైరబోయిన సైదులు, బైరబోయిన మహారాజు, గిర్దావర్ జలెంధర్‌రావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

తిమ్మాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ తిరునగరి గోపి, ఐకేపీ మండల సీసీ నగేష్ సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గజవెల్లి రమేష్, వీఓఏ బూర్గుల చంద్రకళ, జీడి భాస్కర్, బూర్గుల వెంకన్న, చల్ల వేణుధర్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

నూతనకల్ : విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికబద్ధంగా చదవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల 67వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములునాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అబీదాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామినారాయన్ విద్యార్థుల ప్రతిభ

చివ్వెంల : దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లెవల్-1, లెవల్-2 పరీక్షలలో 478 మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో 265 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూజ్యపాద్ మంత్రస్వరూప్ జీ స్వామీజీ, క్రిష్ణమూర్తి స్వామీజీ, డైరెక్టర్ హర్షిక్ తదితరులు పాల్గొన్నారు.